## క్లుప్తంగా

### కాళికాంబకు ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రహ్మణ్యం శాస్త్రి పాల్గొన్నారు.

### ఎస్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం




జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్‌టీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఎస్‌టీయూ 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నంద్యాల జిల్లా కార్యాలయంలో అజామ్‌బేగ్ అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌టీయూ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం రాష్ట్ర సహాయ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ మాట్లాడారు. సీనియర్ నాయకులు సుబ్బరాయుడు, జయప్రకాష్, తిరుపతయ్య, లక్ష్మినారాయణ, రామకృష్ణ, బంగారురెడ్డి, ఖాదర్‌వలి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస రెడ్డిని సత్కరించారు.

### గర్భిణులకు వైద్య పరీక్షలు



ఉయ్యాలవాడ పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

ఉయ్యాలవాడ : ప్రధానమంత్రి మాతృత్వ యోజన పథకంలో భాగంగా మాయలూరు, ఉయ్యాలవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో శుక్రవారం 60 మంది గర్భిణులకు వైద్యాధికారులు రాబర్ట్ కెనడీ, రమేష్‌చంద్ర బాలాజీ వైద్య పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అలాగే హై రిస్క్ వారిని ముందుగానే గుర్తించి సుఖ ప్రసవాలు జరిపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మిదేవి, కృష్ణ, దస్తగిరి పాల్గొన్నారు.

### బదిలీ ఉద్యోగికి సన్మానం

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న రెవెన్యూ అధికారి వరప్రసాద్ బదిలీ పై ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయానికి మేనేజర్‌గా వెళ్తున్న సందర్భంగా శుక్రవారం ఆయనను మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం హుసేన్ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక పన్నుల వసూళ్లలో నంద్యాలను 5వ స్థానంలో నిలిపేందుకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు.

### 'ఉపాధి' లక్ష్యాలను సాధించాలి

గోస్పాడు: ఉపాధి పనుల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఏపీడీ బాలాజీనాయక్ తెలిపారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం 21లక్షల పని దినాలకు రూ.52.50 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. అందులో ఇప్పటికే 50 శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. బండిఆత్మకూరు, శిరివెళ్ల, నంద్యాల, మహానంది, గోస్పాడు, గడివేముల, పాణ్యం, మిడుతూరు మండలాలు క్లస్టర్‌గా ఉన్నాయని, వెయ్యి ఎకరాల్లో తోటల సాగు చేపట్టాల్సి ఉండగా 550 ఎకరాలు గుర్తించగా 350 ఎకరాలకు అంచనాలు పంపినట్లు చెప్పారు. 37మందికి 60 ఎకరాల్లో పనులు మంజూరయ్యాయన్నారు. ఈసీ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆకుకూరలతో ఆరోగ్యం

దొర్నిపాడు:గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా ఆకుకూరలను తీసుకోవాలని గైనకాలజిస్టు డాక్టర్ తేజశ్విని సూచించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేశారు. డాక్టర్ రుహుల్లాఖాన్, సీహెచ్‌ఓ బాషా పాల్గొన్నారు.

### ఇల్లు దగ్ధం

ఆళ్లగడ్డ: మండలంలోని అహోబిలం గ్రామానికి చెందిన రామయ్య అనే వ్యక్తి ఇంట్లో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇంటితో పాటు పిండిమిషన్ దగ్ధమయ్యాయి.

### రేపు 'మోడల్' ప్రవేశ పరీక్ష

గోస్పాడు: స్థానిక మోడల్ స్కూల్‌లో ఈనెల 11వ తేదీన ఆరో తరగతిలో ప్రవేశానికి మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఖాజాహుసేన్ తెలిపారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ఉంటుందని హాల్‌టికెట్, బ్లూపెన్నుతో పరీక్షకు హాజరు కావాలని సూచించారు.





రుద్రవరం మండలంలోని చందలూరు గ్రామ పొలాల్లో రబీలో భాగంగా మొక్కజొన్న పంట అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు పొలాలను సిద్ధం చేయడంలో భాగంగా మొక్కజొన్న పంట వ్యర్థాలను రైతులు కూలీలతో తొలగింపజేయిస్తున్నారు. దీంతో పొలా ల్లో ఎక్కడ చూసినా కూలీల గుంపులు దర్శనమిస్తున్నాయి. అలాగే.. తొలగించిన వ్యర్థాలను కుప్పలుగా వేసి తగలబెడుతున్నారు.



మండలంలో పశు సంపద పుష్కలంగా ఉంది. రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణను చేపడుతున్నారు. దీంతో సేంద్రియ ఎరువుకు ఇబ్బందులు లేవు. లోతు దుక్కులు పూర్తి చేసి రెండో సారి దున్ని చదును చేసుకున్న రైతులు పొలాల్లో సేంద్రియ ఎరువుల తోలి ఉంచారు. కొన్ని చోట్ల వెదజల్లడం కూడా పూర్తయ్యింది. ఇందులో భాగంగా అప్పనపల్లె వద్ద పొలంలో సేంద్రియ ఎరువు తోలి ఉంచారు.



మండలంలో 16 గ్రామ సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలున్నాయి. త్వరలో ఖరీఫ్ పంటలు సాగవనున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ రైతులకు అవసరమైన ఎరువులను సిద్ధంగా ఉంచింది. ఇప్పటికే పది రైతు భరోసా కేంద్రాల్లో దాదాపు 200 టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయి. మరో ఆరు కేంద్రాలకు అవసరమైన ఎరువులకు ప్రతిపాదనలు పంపామని,రెండు,మూడు రోజుల్లో వస్తాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

# రెట్టించిన ఉత్సాహంలో అన్నదాతలు

- ఖరీఫ్‌నకు సన్నద్ధమవుతున్న రైతులు
- ముందస్తుగానే సేద్యపు పనులు
- ఎరువులు,విత్తనాలు సిద్ధం చేసిన అధికారులు
- 35 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం



ఆర్.కొత్తూరు వద్ద సేద్యం చేస్తున్న ట్రాక్టరు

రుద్రవరం: గతేడాది ఖరీఫ్‌తో పాటు రబీలో సాగు చేసిన పంటలు మంచి దిగుబడితో పాటు ధర కూడా లభించింది. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగుకు రెట్టించిన ఉత్సాహంతో పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఓ వైపు పొలాల్లో పంటల అవశేషాల తొలగింపు, లోతు దుక్కులు, ఎరువులు వెదజల్లడంతో పాటు ఎరువులు, విత్తనాలు సేకరించే పనుల్లో రైతన్నలు బిజీగా ఉన్నారు. పంటల సాగు మొదలయ్యే సమయానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈనెల ప్రారంభంలోనే వైఎస్సార్ రైతు భరోసా సొమ్మును అన్నదాతల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది. దీంతో పంటలకు పెట్టుబడిసాయంగా ఉపయోగపడుతుందని కర్షకులు సంబరపడిపోతున్నారు.

**పుష్కలంగా ఎరువులు, జీలుగ విత్తనాలు..**



మండలంలో సాగయ్యే పంటలు, వాటికి ఎలాంటి ఎరువులు అధికంగా అవసరమవుతాయో వ్యవసాయ అధికారులు ముందుగానే గ్రహించి ఈ మేరకు ఎరువులు తెప్పించి ఉంచారు. ప్రస్తుతం 16 ఆర్బీకేలకు గాను 10 ఆర్బీకేల్లో 200 టన్నులు ఎరువులు అందుబాటులోనున్నాయి. ఇక వరి అధికంగా సాగవనుండటంతో రైతులు పంట సాగుకు ముందే భూసారం పెంపొందింపజేయడానికి జీలుగ సాగు చేస్తారు. ఇందుకు అవసరమైన 700 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందజేస్తోంది. ఇప్పటికే దాదాపు రైతులకు అందజేసింది. మిగిలిన వారు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేయించుకుంటే అందజేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

**జోరుగా వ్యవసాయ పనులు..**

గత కొద్ది రోజులుగా మండలంలోని వ్యవసాయ పొలాల్లో ఎక్కడ చూసినా కూలీలు గుంపులు గుంపులుగా పని చేస్తున్నారు. దీంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం మగవారికి రూ.400 నుంచి రూ.500 వరకు డిమాండ్ చేస్తుండగా.. మహిళలకు రూ.350 నుంచి రూ.450 వరకు అడుగుతున్నారు. ఇక పొలాల్లో పంటల అవశేషాలు తొలగించడం, ఎరువులు వెదజల్లడం, చెత్త కుప్పలుగా వేసి తగలబెట్టడం పనులకు కూలీలు అవసరమవుతున్నారు.

**35వేల ఎకరాల్లో సాగు..**

మండలంలో 21 గ్రామ పంచాతీలు ఉండగా వాటి పరిధిలోని చెరువులు, కుంటలు, తెలుగుగంగ కాల్వలు, బోరు బావుల కింద మొత్తం దాదాపు 35వేల ఎకరాల సాగు భూమి ఉంది. ప్రతి ఏడాది ఖరీఫ్‌లో వివిధ రకాల పంటల సాగు చేస్తారు. గతేడాది వ్యవసాయం కలిసి రావడంతో ఈ ఏడాది రైతులు ముందస్తుగానే పంటల సాగుకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే పొలాలను రూపుదిద్దగా.. ఎరువులు, విత్తనాలు సమకూర్చుకునే పనుల్లో బీజీగా ఉన్నారు.

**ఎరువులు, జీలుగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి**

రైతులు ముందస్తుగానే సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే పొలాల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షం కురిస్తే విత్తు విత్తేందుకు సమాయాత్తం అయ్యారు. అందువల్ల వారికి అవసరమైన ఎరువులను ఆయా గ్రామాల ఆర్బీకేల్లో సిద్ధం చేసి ఉంచాం. అలాగే సబ్సిడీ జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే కొందరు రైతులు తీసుకెళ్లారు. మినుము విత్తనాలకు ప్రతిపాదనలు పంపాం, రాగానే రైతులకు పంపిణీ చేస్తాం. గత నెలలోనే పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించడం ప్రారంభించాం, త్వరలోనే వాటి ఫలితాలు వస్తాయి.

– శ్రీకృష్ణ, వ్యవసాయాధికారి, రుద్రవరం

**రుద్రవరం మండలంలో..**

- 16 గ్రామ సచివాలయాలకు గాను పదింటిలో ఎరువులు సమృద్ధిగా నిల్వ ఉన్నాయి. మిగిలిన ఆరింటికి ప్రతిపాదనలు పంపారు. వాటికి కూడా త్వరలో చేరే అవకాశముంది.
- సబ్సిడీ జీలుగ విత్తనాలు 700 క్వింటాళ్లు మంజూరయ్యాయి.
- మండలంలో నంద్యాల సోన, కర్నూలు సోనతో పాటు షుగర్ లెస్ రకం వరి వంగడాలను అధికంగా సాగు చేస్తారు.
- 9,758 మంది రైతుల ఖాతాల్లో రూ.5,36,73,000 రైతు భరోసా సొమ్ము ఇప్పటికే జమ అయ్యింది.
- మొత్తం 35వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో పంటలు సాగు చేయనున్నారు.

**ఖరీఫ్ సీజన్‌లో సాగవనున్న పంటలు..**

| పంట రకం | ఎకరాల్లో |
| --- | --- |
| వరి | 16,250 |
| మొక్కజొన్న | 11,600 |
| మినుము | 2,200 |
| పత్తి | 1,350 |
| మిరప | 1100 |
| పసుపు | 300 |
| ఎండు మిరప | 200 |
| ఇతరములు | 2,000 |

## వైద్యసేవల్లో నిర్లక్ష్యాన్ని సహించం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్



పోలూరులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల(రూరల్): వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. కానాల, పోలూరు గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులను కూడా అందజేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. హైరిస్కు గర్భిణులకు చేస్తున్న హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలు, వారికి పంపిణీ చేస్తున్న ఐరన్ ఫోలిక్ మాత్రల గురించి అడిగి తెలుసుకున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో పలు రికార్డులు, రిజిస్టర్లు, యాప్‌లను కలెక్టర్ తనిఖీ చేశారు. మాతాశిశువు మరణాలు అరికట్టడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్యశాఖ కార్యకర్తలు సమన్వయంగా పనిచేయాలని ఆదేశించారు. చాపిరేవుల, గోస్పాడు పీహెచ్‌సీల వైద్యులు ఉదయసంధ్య, గోపాల్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ తనూజ పాల్గొన్నారు.

**విద్యాకానుక కిట్ల పరిశీలన**

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో జగనన్న విద్యాకానుక కిట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పరిశీలించారు. బూట్లు, యూనిఫాం, పుస్తకాలను పరిశీలించారు. ఈనెల 12వ తేదీన పాఠశాలల పునః ప్రారంభం రోజున అన్ని పాఠశాలలో పంపిణీకి సిద్ధంగా ఉంచాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. డీఈఓ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎన్‌జీఓ కాలనీలో ఉన్న గుడ్‌షెపర్డ్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని బీసీ, ఎస్సీఎస్టీ, మైనార్టీ, రాయలసీమ విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ ఈఓ మహబూబ్‌బేగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. యూనియన్ నాయకులు రాజునాయుడు, శివకృష్ణయాదవ్, చల్లా సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా అక్రమ అడ్మిషన్లు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు.

## పథకాల గురించి ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసి వాటి గురించి తెలియజేయాల్సిన బాధ్యత గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లపై ఉందని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ అధ్యక్షతన గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయాల్లో పనిచేసే అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. అర్హులందరికీ పథకాలు అందజేసే బాధ్యత మీదేనన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమం వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో 7,621 మంది లబ్ధిదారులను గుర్తించగా ఇప్పటి వరకు 5,723 మంది వివరాలు అప్‌లోడ్ చేశారని మిగిలిన వారివి వారం లోపు పూర్తి చేయాలని సూచించారు.

## ముమ్మరంగా వేసవి సేద్యాలు



దొర్నిపాడులో ట్రాక్టర్‌తో లోతు దుక్కులు చేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలో రైతులు వేసవి సేద్యాల్లో నిమగ్నమయ్యారు. కొద్ది రోజుల్లో ఖరీఫ్ పంటలు మొదలయ్యే అవకాశముండటంతో పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే గత పంట అవశేషాలను తొలగించి రెండో సారి సేద్యం చేస్తున్నారు. రైతులు ఇప్పటి నుంచే మెట్ట పంటలకు ఎకరాకురూ.15వేల నుంచి రూ.20వేలు, పత్తి, మిరప పంటలకు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ముందస్తు కౌలు చెల్లించి పొలాలను గుత్తకు తీసుకుంటున్నారు. ఈ సారి అన్ని పంటల దిగుబడులు, ధరలు ఆశాజనకంగా లభించడంతో కౌలు ధరలు పెంచేశారు. ముఖ్యంగా మిరప పంట కౌలు రైతులకు మంచి లాభాలు తెచ్చి పెట్టింది.

## అక్రమ కట్టడాలను తొలగిస్తాం



ఉయ్యాలవాడలో రోడ్డుపైకొచ్చిన కట్టడాల కొలతలను పరిశీలిస్తున్న డీఈ

ఉయ్యాలవాడ : భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె ఆర్‌అండ్‌బీ రహదారిలోనున్న అక్రమ కట్టడాలను తొలగిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు రహదారికి ఇరువైపులనున్న అక్రమ కట్టడాలను తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామని, గృహ యజమానులు స్వచ్ఛందంగా రెండు రోజుల్లో తొలగించని పక్షంలో సోమవారం నుంచి తొలగింపు పనులు చేపడతామని స్పష్టం చేశారు. అలాగే ఈ రహదారిలో హరివరం, పడిగెపాడు, క్రిష్టిపాడు, కంపమల్ల, ఇంజేడు, పెద్దయమ్మనూరు గ్రామాల్లో కూడా వారం రోజుల్లో సర్వే చేసి తొలగింపు చర్యలు చేపడతామని తెలిపారు. జేఈ హుసేన్‌సాహెబ్, మండల సర్వేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## కొనసాగుతున్న చెస్ పోటీలు



చెస్ పోటీలను పర్యవేక్షిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీరామకృష్ణ పీజీ కళాశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం కొనసాగాయి. టోర్నమెంట్ ఆర్గనైజర్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ కేవీవీ శర్మ, వెంకటేశ్వర్లు రెండో రోజు పోటీలను ప్రారంభించారు. మూడవ రౌండ్ ముగిసే సమయానికి నంద్యాలకు చెందిన హర్షవర్ధన్ 3/3 పాయింట్లు సాధించి ముందంజలో ఉన్నారని నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికృష్ణ తెలిపారు.

## బీజేపీతో రాష్ట్రానికి తీరని అన్యాయం




మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చి ఆదుకుంటామని హామీనిచ్చిన బీజేపీ వాటిని పూర్తి చేయండా తీరని అన్యాయం చేసిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సీపీఐ జిల్లా ప్రధానకార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ, త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసేందుకు బీజేపీ సిద్ధమైందన్నారు. కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 11న నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బాబాఫక్రుద్దీన్, సుంకయ్య, రాధాకృష్ణ, ప్రసాద్, సుగుణమ్మ, భాస్కర్, ధనుంజయుడు పాల్గొన్నారు.

## నేటి నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'

చాగలమర్రి: మండల కేంద్రంలో ఈ నెల 10వ తేదీ నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ జి కుమార్‌రెడ్డి శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. వారు మాట్లాడుతూ శనివారం సాయంత్రం 1వ వార్డు నుంచి కార్యక్రమం ప్రారంభిస్తారని చెప్పారు.

## 2,144 పాఠ్య పుస్తకాలు మంజూరు

ఉయ్యాలవాడ : జగనన్న విద్యా కానుకల్లో భాగంగా నాలగవ విడతలో మండలానికి 2,144 వివిధ రకాల పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ అనురాధ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు 17,744 పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయన్నారు. అలాగే 14,600 నోటు పుస్తకాలు, బూట్లు 2,032 వచ్చాయని చెప్పారు.

## ఏఓగా భరణి కుమారి



చాగలమర్రి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఏఓగా భరణి కుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఓగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ సాధారణ బదిలీల్లో భాగంగా గడివేముల కార్యాలయానికి బదిలీ అయ్యారు. వెలుగోడు కార్యాలయంలో సీనియర్ సహాయకురాలిగా విధులు నిర్వహిస్తున్న భరణి కుమారి పదోన్నతిపై ఇక్కడికి బదిలీపై వచ్చారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బొమ్మలసత్రం: ప్రజలు యూపీఐ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని, యూపీఐ పిన్ ఎవరికీ తెలియకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కొంతకాలంగా చాలా మంది వ్యాపారుల నుంచి యూపీఐ ద్వారా నగదు మోసపోయినట్ల ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దుకాణాల వద్దక వచ్చి వస్తువులు కొనుగోలు చేసిన తర్వాత యూపీఐ ద్వారా నగదు పంపుతామని చెబుతారు. తమ ఫోన్ నుంచి వ్యాపారికి నగదు బదిలీ కావటం లేదని చెప్పి మొదట రూ. 1 వ్యాపారికి ఫోన్‌పే చేస్తారు. తర్వాతా యూపీఐ ద్వారా మనీ రిక్వెస్ట్ పంపి వ్యాపారి ఖాతా నుంచి నగదు ఖాళీ చేస్తున్నారు. ఎవరైనా వ్యాపారులు ఇలాంటి మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

**నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

నంద్యాల(అర్బన్): పట్టణంలోని డి1, డి2, డి3 సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ట్రాన్స్‌కో డీఈ ఆంథోనిరాజు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని 42 వార్డుల పరిధిలో లైన్ల మరమ్మతుల కోసం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

**ఘర్షణ..ఒకరికి గాయాలు**

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరులో శుక్రవారం ఇద్దరు వ్యక్తుల మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. సాయంత్రం గ్రామంలోని ఓ ప్రదేశంలో కొందరు గుంపుగా చేరారు. ఒకరినొకరు మాట్లాడుకుంటుండగా ఇద్దరి మధ్య వాగ్వాదం నెలకొని దాడికి దారి తీసింది. దాడిలో విజయ్ అనే వ్యక్తి అంకాల్ తలపై రోకలి బండతో మోదగా రక్త గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

## మెడికల్ కళాశాల పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి, కలెక్టర్

నంద్యాలటౌన్: నంద్యాల మెడికల్ కళాశాలలో మిగిలిన నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి కళాశాల ప్రిన్సిపాల్‌కు అప్పగించాలని ఏపీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కళాశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌తో కలిసి పరిశీలించారు. మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ పనులు చివరి దశకు వచ్చాయని, మెడికల్ విద్యార్థులకు అవసరమయ్యే సదుపాయాలను దగ్గరుండి ఏర్పాటు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్‌కుమార్‌కు సూచించారు. లెక్చరర్ హాల్, అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, హిస్టాలజికల్ ల్యాబ్‌లను పరిశీలించి ఇంజినీర్లకు పలు సూచనలు చేశారు. జూలై 1వ తేదీ లోపు ప్రిన్సిపాల్ ఛాంబర్‌ను సిద్ధం చేసుకుని అక్కడే ఉండి పనులు పూర్తి చేయించాలని చెప్పారు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్లలో జూలై 30లోపు పనులు పూర్తిస్థాయిలో ముగించాలని ఎస్ఈఈటీ కృష్ణారెడ్డి, ఈఈ శ్రీనివాసులు రెడ్డిని ఆదేశించారు. సర్వజన వైద్యశాల పర్యవేక్షకులు ప్రసాదరావు ఉన్నారు

## నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు

నంద్యాల(సెంట్రల్): అన్నదాతలకు అనుమతి లేని ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ రాజశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లోని ఎరువులు, పురుగుల మందుకాణాల్లో మండల వ్యవసాయాధికారి ప్రసాదరావుతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా ఆర్‌కే ఎంటర్‌ప్రైజెస్, నాగశివశంకర, సాయిశ్రీనివాస, వెంకటశివ సాయి, నంది ఏజెన్సీల్లో విస్తృత తనిఖీలు చేశారు. సుమారు రూ.1.72లక్షల విలువైన పలు రకాల ఎరువులు, పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. దుకాణాల్లో స్టాక్ బోర్డు, ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు.

## మద్దతు ధరతో పసుపు కొనుగోలు

నంద్యాల (సెంట్రల్): వచ్చే వారం నుంచి మద్దతు ధర రూ.6,850తో పసుపు కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా నిర్వహణాధికారి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహానంది, నంద్యాల, ఆళ్లగడ్డ, బానకచర్లలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉద్యాన శాఖ లెక్కల ప్రకారం గత ఖరీఫ్‌లో 1,121 మంది రైతులు 1,713 ఎకరాల్లో పసుపు సాగు చేశారని, 57,281 క్వింటాళ్ల దిగుబడి అంచనాలున్నట్లు పేర్కొన్నారు. పంట సాగు చేసిన 43 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 772 పసుపు రైతులు మార్క్‌ఫెడ్‌కు విక్రయించేందుకు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ప్రతి రైతు 30 క్వింటాళ్ల వరకు మాత్రమే పంటను తీసుకురావాలని, కృత్రిమమైన రంగు, బూజు లేకుండా ఉండాలని సూచించారు. వ్యర్థాలు, దెబ్బతిన్నవి, పురుగు పట్టినవి తదితరాలు సరాసరి 2 శాతం లోపు ఉండే విధంగా చూసుకోవాలన్నారు.

## ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

గోస్పాడు: ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఎంపీడీఓ బాస్కర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాలకు 757 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 367 పూర్తయ్యాయని, 370 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం జూలేపల్లె గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. ఈఓఆర్‌డీ నాగేంద్రుడు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగుల కల నెరవేర్చిన సీఎం జగన్



ఉద్యోగుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న శిల్పామోహన్‌రెడ్డి

నంద్యాల: కాంట్రాక్ట్ ఉద్యోగులు 30 ఏళ్లగా తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేస్తారని ఎదురు చూశారని, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి వారి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని శిల్పా స్వగృహంలో గవర్నమెంట్ ఫెడరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, కాంట్రాక్ట్ ఉద్యోగులు మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఉద్యోగులు భాస్కర్, అనిల్, శ్రీనివాసులు, ఇందిర మాట్లాడుతూ సీఎం జగన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల గుండెల్లో నిలిచి పోయారన్నారు. పీఆర్సీని అమలు చేయడానికి కమిటీని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి జీపీఎస్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఉద్యోగులకు మంచి ప్రయోజనాలు కలుగుతాయన్నారు.

## హజ్ యాత్రికులకు సన్మానం

ఆళ్లగడ్డ: హజ్ యాత్రకు బయలు దేరుతున్న ఇద్దరు ముస్లిం పెద్దలను ఆళ్లగడ్డలో సన్మానించారు. పట్టణానికి చెందిన జమాల్‌వలి, మహబూబ్ బాషాను పట్టణ శివారులోని ఈద్గాలో శుక్రవారం రాత్రి ముస్లిం మత పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై సన్మానించారు.